క్లుప్తంగా

అలరించిన భక్తి సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, ఘంటసాల స్వరాంజలి సాంస్కృతిక సేవా సంస్థ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం భక్తి సంగీత విభావరి జరిగింది. డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ ఆధ్వర్యాన ఒంగోలుకు చెందిన లక్ష్మీ ప్రసన్న పర్యవేక్షణలో గాయనీ గాయకులు మనోహర్, తాడూరి శేషగిరిరావు, యశోద, మహేశ్వరి తదితరులు పలు భక్తి గీతాలతోపాటు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. ఘంటసాల స్వరాంజలి సేవాసంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ నాగేశ్వరమ్మ మాట్లాడుతూ విజయవాడ సాంస్కృతిక కళాకేంద్రమన్నారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, శింగంశెట్టి చంద్రశేఖర్, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

కాపులు ఐక్యంగా ఉండాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించడానికి కృషి చేయాలని, కాపులు ఐక్యంగా ఉండాలని ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం ప్రజా కాపునాడు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం తుమ్మలపాలెం యూత్ అధ్యక్షుడిగా మెట్టు మురలబు శ్రీనివాసుకి యర్రంశెట్టి అంజిబాబు నియామకపత్రం అందజేశారు.

సాయి మందిరానికి గోవు అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక శ్రీభగవాన్ షిర్డీ సాయిబాబా మందిరానికి శనివారం దాత అల్లూరి శ్రీనివాసరాజు, సుజాత దంపతులు ఆవు, దూడను బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వలివేటి శ్రీనివాస శర్మ ఆవు దూడలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మందిర గౌరవాధ్యక్షులు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎన్‌రాజు , మందిర అధ్యక్షుడు వైవీ శివాజీ, ఎం.బాలవర్ధనరావు, విష్ణు సహస్రనామ పారాయణ మండలి మధురానగర్ శాఖ అధ్యక్షులు హేమ శివసత్య ప్రసాద్ తదితదిరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని తోటి వారికి సేవ చేయడం అలవాటు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ అన్నారు. 31వ డివిజన్ ముత్యాలంపాడు ఆరోగ్య వేళంగిణి మాత చర్చి సమీపంలో శనివారం సాయంత్రం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం భోజనాలు వడ్డించారు. ఫాదర్ శేఖర్ ప్రార్థనలు చేసి క్రిస్మస్ సందేశం వివరించారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా, సంఘ సోదరులు నాని, గోవర్ధనరావు, తిరుమలరావు, ఏడుకొండలు, ఏలేటి నాగరాజు, పి.మురళి, బెనర్జీ, సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు

శాంతాకారం భుజగశయనం

- ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు
- వైష్ణవ ఆలయాల్లో భక్తుల సందడి



శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో



శ్రీశివజ్ఞానపీఠంలో అవిసి పూలతో స్వామివారు



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..



ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో



పూలతో ప్రత్యేక అలంకారంలో స్వామివారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వందే విష్ణుం భవ భయ హరం అంటూ భక్తజనం శ్రీమన్నారాయణుడిని స్తుతించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం వైష్ణవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయోధ్యనగర్, ముత్యాలంపాడు, రామకృష్ణాపురం, మాచవరం, దేవీనగర్, దావుబుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాల్లో దేవాలయాలు ఉదయం 4గంటలకే భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయాయి. స్వామివారు ఉత్తరద్వారంలో దర్శనం ఇచ్చారు. ధనుర్మాసం వైకుంఠ ఏకాదశి స్వామివారికి ప్రీతికరమైన శనివారం కలిసి రావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో..

అయోధ్యనగర్‌లోని శ్రీ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన స్వామివారికి లక్ష తులసీదళ అర్చన, విశేష పూజలు అభిషేకాలు జరిగాయి. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

శ్రీశివజ్ఞానపీఠంలో..

శ్రీ శివజ్ఞాన పీఠంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని పీఠాధిపతి శివాచార్యులు లోక కల్యాణార్థం విశేషంగా సహస్ర అవిసి కుసుమార్చన చేశారు.

అర్చకులు వైకుంఠ ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో పీఠం ధర్మాధికారి పేర్ల శ్యాంప్రసాద్, పాలడుగు హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడులోని శ్రీకోదండ రామాలయంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక వాహనంలో స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి డి.శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు తదితరులు పర్యవేక్షించారు.

దాసాంజనేయస్వామి దేవాలయంలో..

మాచవరం దాసాంజనేయస్వామివారి ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా విశేష అర్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో..

దావు బుచ్చయ్యకాలనీ శ్రీకల్యాణ వేంకటేశ్వర



భోజనాలు వడ్డిస్తున్న గౌతంరెడ్డి

స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని పలురకాల పుష్పాలతో అర్చకుడు రంగాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి పర్యవేక్షించారు.

బాబా మందిరంలో ఏకాదశి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. బాబాకు విశేషంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. బాబావారు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర గౌరవాధ్యక్షుడు గౌతంరెడ్డి ప్రత్యేక పూజలు చేసి భోజనాలు వడ్డించారు. తెల్లవారుజామున నగర సంకీర్తన జరిగింది. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పాయకాపురం(విజయవాడరూరల్): ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం న్యూరాజీవ్‌నగర్‌లోని శ్రీకోదండ రామాలయంలో భక్తులు స్వామివారిని ఉత్తరముఖ దర్శనం ద్వారంలో దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శివరామకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కండె గురవయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎల్‌బీఎస్ నగర్లోని శ్రీకోదండ రామాలయం, పోలీసు స్టేషన్ రోడ్డులో శ్రీరామాలయం, 64వ డివిజన్ కండ్రికలో శ్రీకోదండ రామాలయంలో స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం దర్శించుకున్నారు.



శివరామకృష్ణ క్షేత్రంలోని స్వామి వారు

విజయవాడకల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మలయప్ప స్వామిని గరుడ వాహనంపై అలంకరించారు. పూజల అనంతరం ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్నారు.

అక్షరశిల్పి సోమేపల్లి వెంకట సుబ్బయ్య



మాట్లాడుతున్న భవానీదేవి, కొల్లూరి, ఆంజనేయరాజు, తదితరులు

విజయవాడ కల్చరల్: అక్షరశిల్పి సోమేపల్లి వెంకట సుబ్బయ్య అని ఎక్స్‌రే సాహిత్య సేవాసంస్థ వ్యవస్థాపకుడు కొల్లూరి అన్నారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యాన ఏపీ రచయితల సంఘం వ్యవస్థాపకుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య సంస్మరణ సభను శనివారం గాంధీనగర్ హోటల్ ఐలాపురంలో నిర్వహించారు. కొల్లూరి మాట్లాడుతూ ఏపీ రచయితల సంఘం ద్వారా ఎందరినో సాహితీ రంగం వైపు మళ్లించారన్నారు. రచయిత్రి చిల్లర భవానీ దేవి మాట్లాడుతూ కవి సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించేవారని తెలిపారు. ఎక్స్‌రే కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, ఏపీ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ సోమేపల్లితో అనుబంధం గుర్తుచేసుకున్నారు. తొలుత సోమేపల్లి మృతికి సాహితీవేత్తలు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జీవీ పూర్ణచందు, రవికిరణ్, శింగంపల్లి అశోక్‌కుమార్, సీహెచ్‌వీ సుబ్బయ్య,తోపాటు ఎక్స్‌రే సాహిత సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పీవీ సంస్కరణలు.. దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదులు

కార్పొరేటర్ శర్వాణిమూర్తి



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దేశంలో బలమైన ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేసింది మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి కొనియాడారు. సత్యనారాయణపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పీవీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ శర్వాణిమూర్తి పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను తన సంస్కరణలతో గాడిన పెట్టిన మహామేధావి పీవీ నరసింహారావు అని చెప్పారు. అటువంటి మహనీయుని సేవల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాసరావు, రాష్ట్రీయ పరశురామ సేన అధ్యక్షుడు చల్లా సుధాకర్, సత్యనారాయణపురం వర్తక సంఘం అధ్యక్షుడు మైలవరపు రామకృష్ణ, నాయకులు శనగవరపు శ్రీనివాసరావు, కమ్మిలి రత్నకుమార్, పి.మధు, టి.వి నారాయణ, రమణయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతను నిత్యం పఠించాలి



భగవద్గీత పోటీ విజేతలతో నిర్వాహకులు

విజయవాడకల్చరల్: భగవద్గీతను నిత్యం పఠించాలని కార్పొరేటర్ శర్వాణీ మూర్తి అన్నారు. టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి కన్వెన్షన్‌లో ఆదివారం జూనియర్, సీనియర్ విభాగంలో సంపూర్ణ భగవద్గీత పోటీలను నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్, మంగిపూడి వెంకటశాస్త్రి, యనమండ్ర సుబ్రహ్మణ్యం, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు కొలవెన్ను వెంకటరమణ, బాలకోటేశ్వరరావు విజేతలను అభినందించారు.

సంపూర్ణ భగవద్గీత విజేతలు: జూనియర్ విభాగంలో వీవీఎస్ శ్రీధర్ ప్రథమ బహుమతి, జి.దీక్షిత ద్వితీయ బహుమతి కె.అంజికౌశిక్ తృతీయ బహుమతి, సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి పి.అరుణకుమారి, ద్వితీయ బహుమతి శ్యామ, తృతీయ బహుమతి సూర్య గెలుపొందారు విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కనకదుర్గ, రాజేశ్వరి, మంగిపూడి వెంకటశాస్త్రి, సావిత్రి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

నిరుపేదల ఆరోగ్యానికి పెద్దపీట



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలో నిరుపేద ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా అన్నారు. ఆ డివిజన్‌లో ఇటీవల జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కంటి సమస్యలతో బాధపడుతున్న 63 మందికి కళ్లజోళ్లు అవసరం ఉందని వైద్యులు గుర్తించారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లను తయారుచేసి పంపగా కార్పొరేటర్ షాహీనా సుల్తానా శనివారం వాటిని రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు అందిస్తూనే మరోవైపు జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థులు



సిద్ధార్థ వైద్య కళాశాలలో..

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో 1996–2001 బీడీఎస్ బ్యాచ్ విద్యార్థులు శనివారం ఆ కళాశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజ్ఞ – 23 పేరుతో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా నాటి గురువులతో పాటు ప్రస్తుతం ఉన్న గురువులను కృతజ్ఞతగా సత్కరించారు. తమ అభ్యున్నతికి కారణమైన కళాశాలకు రూ.3 లక్షల విలువ చేసే ఇంట్రాక్టివ్ డిజిటల్ ప్యానల్(స్మార్ట్ బోర్డ్)ను , ఆడియో సిస్టమ్‌ను బహూకరించారు. కళాశాలలో ఆధునిక పద్ధతిలో విద్యాబోధన, సెమినార్లు, సదస్సుల నిర్వహణకు స్మార్ట్ బోర్డును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావుకు అందజేశారు. తాము చదువుకునే రోజుల్లో ప్రజ్ఞ అని ఒక సైంటిఫిక్ క్లబ్‌ను నిర్వహించినట్లు గుర్తు చేసుకున్నారు. తమ మధ్య స్నేహాన్ని బలోపేతం చేసిన ఆ క్లబ్ పేరు మీదగా ఈ వేడుకలకు ప్రజ్ఞ – 23 పేరు పెట్టామన్నారు. పాత మిత్రులను, పూర్వ గురువులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.రూపశ్రీ, డాక్టర్ యు.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో 1998 బ్యాచ్ విద్యార్థులు శనివారం ఆ కళాశాలలో కలుసుకున్నారు. తాము వైద్య విద్యను అభ్యసించి 25 ఏళ్లు గడిచిన సందర్భంగా వారంతా సమావేశమై రజతోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్‌లను మర్యాదపూర్వకంగా కలిసి, ఆ కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ కిషోర్, డాక్టర్ విజయ్‌సింహ, డాక్టర్ కిరణ్ మాదల, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ ఉమాకళ్యాణి, డాక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత వైభవం చాటిన కచేరి



విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శనివారం నిర్వహించిన సంగీత విద్వాంసుడు చిట్టా కార్తీక్ గాత్ర సంగీతం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. సంగీత త్రిమూర్తులు సద్గురు త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి రచించి స్వరపరచిన సంకీర్తనలను మధురంగా ఆలపించారు. పెవరవలి నందకుమార్ వయోలిన్‌పై కుందుర్తి అరవింద్ మృదంగంపై కేవీ రామకృష్ణ సహకరించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నిర్వాహకుల కృషిని అభినందించారు. సంస్థ కార్యదర్శి సీవీ రావు, సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్ పాల్గొన్నారు.

పేదల కోసం అనేక పథకాలు



కళ్లజోళ్లు అందజేస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పేదల కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నారని డీఎంహెచ్ఓ సుహాసిని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పరీక్షలు చేయించుకుని, కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన వారికి శనివారం కళ్లజోళ్లను అందజేశారు. నగరంలోని అజిత్ సింగ్‌నగర్ యూపీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పలువురికి కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా 243 సచివాలయానికి సంబంధించి 14 మందికి, 244 సచివాలయం పరిధిలో 38 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. కళ్లజోళ్లు అందుకున్న వారు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ డీపీఎంఓ డాక్టర్ నవీన్, డెప్యూటీ తహసీల్దార్ ఎన్.కోటేశ్వరమ్మ, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సృజన్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరికీ వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా చెప్పారు. నేషనల్ కన్స్యూమర్స్ డే సందర్భంగా శనివారం రావిచెట్టు సెంటర్ సమీపంలోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో వినియోగదారులు హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. విద్యాకన్నా మాట్లాడుతూ.. 1986వ సంవత్సరం నుంచి మన దేశంలో వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగానే వినియోగదారుల హక్కులు పొందామని చెప్పారు. 1962వ సంవత్సరంలో అమెరికాలో ప్రప్రథమంగా వినియోగదారుల హక్కులు ప్రకటించారన్నారు. ఈ చట్టం ద్వారా లోపభూయిష్ట వస్తువుల విక్రయం, అన్యాయమైన వ్యాపారం, మోసం, సేవల్లో లోపం వంటి వాటి నుంచి వియోగదారులకు రక్షణ కల్పించడం ఈ చట్టం ముఖ్య లక్ష్యమని విద్యాకన్నా చెప్పారు. ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకుని, సేవల విషయంలో లోపం జరిగితే వినియోగదారుల కోర్టులను ఆశ్రయించి పరిహారం పొందవచ్చన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): తన రెండో కుమారుడు రెండు రోజులుగా కనిపించడంలేదని చల్లా దేవీ భవాని నున్న పోలీసుస్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాష్‌నగర్‌కు చెందిన చల్లా దేవి భవానీ రెండవ కుమారుడు చల్లా అయ్యప్ప బీసెంటురోడ్డులోని దుస్తుల దుకాణంలో పని చేస్తుంటాడు. ఈ నెల 21వ తేదీ షాపునకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉన్న అయ్యప్పను వాటర్ హీటర్ కాలిపోయిన విషయంలో తల్లి మందలించింది. అదే రోజు సాయంత్రం నుంచి కుమారుడు కనిపించడంలేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేశారు.

బైక్ చోరీపై కేసు నమోదు

పెనమలూరు: తాడిగడప సెంటర్‌లో బైక్ చోరీ అవడంపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ చిట్టినగర్‌కు చెందిన దుర్గా వెంకట సాయిసందీప్ ఈ నెల 19వ తేదీన తాడిగడప సెంటర్‌లో ఉంటున్న మిత్రుడు సోహెల్ రూమ్‌కు బైక్‌పై రాత్రి వచ్చాడు. అతను బైక్ రూమ్ ఎదుట పార్క్ చేసి కొద్ది సమయం తర్వాత బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

27న పేరంటాలమ్మ ఆలయంలో గ్రామసభ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈ నెల 27వ తేదీన సంక్రాంతి మహోత్సవాల నిర్వహణకు గ్రామసభ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆలయంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది కూడా సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, అమ్మవారి వంశస్తులు, దేవాదాయ శాఖాధికారులతో సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఉత్సవాల నిర్వహణ, అమ్మవారి గ్రామోత్సవం, ఆలయంలో ఏర్పాట్లు వంటి పలు అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): అవకాశాలు అందిపుచ్చుకుని విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని 31 డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష పిలుపునిచ్చారు. ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలక సంస్థ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు జగనన్న స్ఫూర్తి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే యూనిఫామ్, షూ, బెల్ట్, బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ ఇవ్వటంతో పాటు వారంలో అన్ని రోజులు పౌష్టికాహారం మధ్యాహ్న భోజన రూపంలో అందించడం ఈ ప్రభుత్వానికి విద్యపై ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటయిన బుద్దా అప్పారావు గారి కుమారుడు బుద్దా నాగేశ్వరరావుగారి సంజాయిషీతో తెలియజేయునది విజయవాడ వాస్తవ్యులైన శ్రీ ఒ.వి వెంకట సుబ్బరామ శాస్త్రి గారు మరియూ వారి సోదరుడు అయిన శ్రీ ఒ.వి లక్ష్మీకాంతశాస్త్రి గారున్ను కలసి చదలవాడ పున్నయ్యగారి నుండి విజయవాడ లబ్బీపేట, కొత్త మాదవరావు వీదిలోని చ.గ.592.1/2 లు నివేశ్న స్థలమును ది. 11-05-1959 వ తేదీ రిజిష్టర్డు క్రయదస్తవేజు (నెం.1571/1959) రీత్యా క్రయమును పొందిన దరిమిలా వారిరువురు మూజువాణీగా పంచుకొనగా శ్రీ ఒ.వి వెంకట సుబ్బరామ శాస్త్రి గారి వాటాకు సంక్రమించిన చ.గ.360 లు స్థలము [illegible] ... చ.గ.327 లు నివేశ్న స్థలము నందు వారు వారి స్వార్జితపు ధనముతో రెండు అంతస్తుల బిల్డింగును నిర్మించుకొని ఎటువంటి లిఖితపూర్వకమైన ఏర్పాట్లు చేయకుండా ది.05-12-2017 వ తేదీన ఇంటెస్టేట్‌గా పరమపదించిన దరిమిలా సదరు పైతెలిపిన వారి తాలుకూ స్థిరాస్తి హిందు వారసత్వ చట్ట ప్రకారము వారి సన్నిహిత ముఖ్యవారసులైన వారి భార్య శ్రీ ఒ.వి శారద మరియూ కుమారులైన శ్రీ ఒ.వి సచ్చిదానంద శర్మ, శ్రీ ఒ.వి వెంకట నాగ ప్రసాద్, శ్రీ ఒ.వి సీత రామ ప్రసాద్ గారలకు జాయింటుగా సంక్రమించిన దరిమిలా పై తెలిపిన చ.గ.327 లు నివేశ్న స్థలము, అందలి బిల్డింగు స్థిరాస్తిని వారందరు హిందు అవిభక్త జాయింటు స్థిరాస్తిగా పరిగణించుచూ సర్వ సంపూర్ణసమస్త స్వాధీన హక్కుభుక్తములతో నిర్వివాదముగా జాయింటుగా అనుభవించుచున్నారనియు దరిమిలా శ్రీ ఒ.వి శారద మరియు కుమారులైన శ్రీ ఒ.వి సచ్చిదానందశర్మ, శ్రీ ఒ.వి వెంకట నాగ ప్రసాద్, శ్రీ ఒ.వి సీత రామ ప్రసాద్ గారలు పై తెలిపిన స్థిరాస్తిని నాలుగు సమభాగములుగా విభజించుకొని (అనగా ఒక్కొక్కరి వాటాకు చ.గ.81.75 లు నివేశ్న స్థలము, అందలి కట్టడములతో కూడిన స్థిరాస్తి) అందుకు నిదర్శనముగా ది.04-12-2023 వ తేదీన ఒక పార్టీషన్ దస్తావేజును వ్రాసుకొని పటమట సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసు నందు దస్తావేజు నెం.16954/2023 దుగా రిజిష్టరు కాబడిన పార్టీషన్ దస్తావేజులో ఉదహరించిన సి మరియూ డి షెడ్యూళ్ళ దాఖలా స్థిరాస్తులు అనగా పై తెలిపిన చ.గ.327 లు స్థలము అందలి కట్టడములతో కూడిన స్థిరాస్తినకు తూర్పు వైపు హద్దు నుండి రెండు వాటాలుగా శ్రీ ఒ.వి శారద మరియు శ్రీ ఒ.వి సీత రామ ప్రసాద్ గారలకు సంక్రమించినటువంటి వారిరువురూ సర్వ సంపూర్ణసమస్త స్వాధీన హక్కుభుక్తములతో నిర్వివాదముగా అనుభవించుచున్నారనియు వారిరువురు నా క్లయింటునకు తెలియజేసి యున్నారనియు, వారల తాలుకు రెండు వాటాల స్థిరాస్తులు వెరసి చ.గ. 163.5 లు స్థలము అందలి కట్టడములతో కూడిన స్థిరాస్తి అనగా ఈదిగువ షెడ్యూలులో ఉదహరించిన స్థిరాస్తిని వారిరువురు కలసి విక్రయించు ప్రతిపాదనను నా క్లయింటునకు తెలియజేసిన పిదప వారి నుండి ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని నా క్లయింటు క్రయము పొందుటకు బేరారు సేవి, అడ్వాన్సు క్రయ ప్రతిఫలమును శ్రీ ఒ.వి శారద మరియు శ్రీ ఒ.వి సీత రామ ప్రసాద్ గార్లకు చెల్లించి వారిరువురు నుండి నా క్లయింటు పేర ఒక విక్రయ అగ్రిమెంటు పొంది యున్నారనియు, కావున ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి చెల్లదగిన అభ్యంతరములు, కోర్టు జప్తులు, జాయింటు భాగ లబ్ధతగాయిదాలు, వివాదములు, క్లెయిములు ఇతర అన్యాక్రాంత ఒప్పందములు వగైరాలు యున్న యెడల ఈ ప్రకటన తేదీనుండి 7 రోజుల లోపుగా ఈ దిగువ తెలిపిన అడ్రసునకు ఋజువుపరచు సాక్ష్యములతో వ్రాతపూర్వకముగా రిజిష్టరు పోస్టల్ కరెస్పాండెన్స్ (తిరుగు రశీదుతో) ద్వారా తెలియజేయవలయునని లేనియెడల ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్తిపై ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు, ఇతర క్లెయిములు వగైరాలు లేని నిర్వివాద స్థిరాస్తియని భావించి నా క్లయింటు శేషించిన క్రయప్రతిఫలమును శ్రీ ఒ.వి శారద మరియు శ్రీ ఒ.వి సీత రామ ప్రసాద్ గారలకు వారు కోరిన విధముగా చెల్లించి వారిచే నా క్లయింటు పేరున గాని వారు కోరినవార్ల పేర్లనగాని వారు కోరిన విధముగా క్రయ దస్తావేజు/లు వ్రాయించుకొని రిజిష్టరు పొంది షెడ్యూలు దాఖలా స్థిరాస్తి యొక్క స్వాధీనమును కూడ పొందుదురనియూ గడువు దరిమిలా వచ్చు అభ్యంతరములు, ఆక్షేపణలు ఇతర క్లెయిములు వగైరాలు చెల్లనేరవనియూ అవి నా క్లయింటును గాని షెడ్యూలు స్థిరాస్తిని గాని ఎట్టి విధముగా బైండు చేయజాలవనియూ అందరికీ ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

షెడ్యూలు: ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ-10, లబ్బీపేట, కొత్త మాదవరావు వీదిలో యున్నట్టి స్థిరాస్తికి మున్సిపల్ వార్డు నెం.17, రెవెన్యూ వార్డు నెం. 10, బ్లాకు నెం. 19, ఎన్.టి. ఎస్. నెం. 458, ఎసెస్మెంటు నెం. 1073106698, డోర్ నెం. 39-8-46 దు దాఖలా చ.గ 163.5 లు స్థలము అందలి రెండు అంతస్తుల బిల్డింగు కట్టడములు, ఎలక్ట్రిసిటీ సర్వీసు కనెక్షన్, వాటర్ టాప్ మరియూ డ్రైనేజ్ కనెక్షన్, వాటి పిట్టింగ్సు డిపాజిట్లు వగైరా మరియూ యావత్తు ఈజ్మెంటు హక్కులతో కూడిన ఆస్తినకు హద్దులు: **తూర్పు:** బుద్దా నాగేశ్వరరావుగారి ఆస్తి. **దక్షిణము:** కొత్త మాదవరావు వీది. **పడమర:** శ్రీ ఒ.వి వెంకట నాగ ప్రసాద్ గారి వాటాకు రాబడిన స్థిరాస్తి. **ఉత్తరం:**- మాలంపాటి శ్రీవిష్ణుప్రసాద్ మరియూ మాలంపాటి శ్రీసూర్య ప్రసాద్ గార్ల ఆస్తి

మారుపెద్ది రాజ్ కుమార్, VNM న్యాయవాది
డోర్ నెం.54-18-65, 'మద్దిపాటి రాయల్', ఫ్లోర్ నెం.3
ప్లాట్ నెం.4, ఎల్.ఐ.సి కాలనీ, విజయవాడ-8 (9848421199)